akshara printers
An ISO 9001-2015 Certified
WANTED
ADS DESIGNERS
OFF : 19-8-85/F6, SSS COMPLEX, ANNAMAIAH CIRCLE, TIRUPATI-517501.
CELL:9490400684, 9393623191
Email : aksharasriprinters@gmail.com

ఆర్ఎన్ఐ/2009/ 28733
స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 44 తిరుపతి తేది : గురువారం 14 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం

- అనుకూలంగా 144,
- వ్యతిరేకంగా 22 మంది ఎమ్మెల్యేలు ఓటు
- డిఎంకె, పిఎంకె ఎంఎల్ఎల వాకౌట్
- కాంగ్రెస్, లెఫ్ట్, విసికె, ఐయుఎంఎల్‌తో పాటు అన్నాడిఎంకె రెబల్ ఎంఎల్ఎల మద్దతు



చెన్నై - ఆంధ్రనాడు, మే 13

తమిళనాడు అసెంబ్లీలో విజయ్ ప్రభుత్వం బలపరిక్షలో గెలిచింది. బుదవారం జరిగిన బలనిరూపణలో స్పష్టమైన మెజార్టీని తమిళగ వెట్రి కజగం (టివికె) సాధించింది. ఈ విశ్వాస పరీక్షలో అవసరమైన మెజార్టీకన్నా ఎక్కువ మద్దతు సాధిస్తూ విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. తొలుత సిఎం విజయ్ బలనిరూపణకు సంబంధించిన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ అనంతరం స్పీకర్ జెసిడి ప్రభాకర్ ఓటింగ్ నిర్వహించారు. సాధారణంగా జరిగే ఓటింగ్‌కు భిన్నంగా ఒక్కో ఎంఎల్ఎ పేరు పిలుస్తూ వారి ఓటును నమోదు చేయడం గమనార్హం. ఈ ఓటింగ్‌లో విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా 144 మంది ఎంఎల్ఎలు మద్దతు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్నాడిఎంకె ఎంఎల్ఎలు 22 మంది ఓటు వేశారు. అయితే డిఎంకె, పిఎంకె పార్టీలకు చెందిన 61 మంది ఎంఎల్ఎలు వాకౌట్ చేయగా, ప్రభుత్వానికి వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (విసికె), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) పార్టీలు మద్దతు ప్రకటించాయి. అలాగే ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (అన్నాడిఎంకె) రెబల్ ఎంఎల్ఎలు 25 మంది కూడా విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేయడం గమనార్హం. మరోవైపు ఓటింగ్ సందర్భంగా

- మిగతా 2లో..

## సైబర్ నేరాలు అరికట్టండి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి - ఆంధ్రనాడు, మే 13



సైబర్, ఆర్థిక నేరాలు అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల్లో తక్షణ స్పందన-ఎపిలో నియంత్రణా వ్యవస్థలపై సచివాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న సొమ్మును రాబట్టేందుకు గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ టెక్నాలజీలపై

- మిగతా 2లో..



## ఆర్థిక వ్యవస్థ పటిష్టతే లక్ష్యం

- ఇకపై నెల నెలా డేటా సేకరణ
- సామర్ధ్యం పెంపుపై సీఎం చంద్రబాబు దృష్టి
- పటిష్ట ఆర్థిక వ్యవస్థకు సామర్ధ్యం పెంపే మార్గం
- రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రతీ నెలా గణాంకాల సేకరణ
- రాష్ట్రం నుంచి మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ
- ఆర్థిక విశ్లేషణకు ఏఐ టెక్నాలజీ వినియోగం
- 15 శాతం వృద్ధి సాధించి స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన

2లో

## వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలి

- ఇది కొత్త రియాలిటీ... దీన్ని ప్రోత్సహిద్దాం
- సీఎం చంద్రబాబు పిలుపు
- పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో ప్రధాని 8 సూచనలను పాటిద్దామన్న ముఖ్యమంత్రి
- పెట్రోల్ వాడకం, విదేశీ పర్యటనలు తగ్గించుకుని దుబారాకు అడ్డుకట్ట వేయాలని సూచన
- అమరావతిలో బైసర్ ఇన్‌స్టిట్యూట్, కిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- క్వాంటమ్ వ్యాలీతో అమరావతి నుంచి ప్రపంచానికి కంప్యూటర్లు అందిస్తామన్న సీఎం

అమరావతి - ఆంధ్రనాడు, మే 13

ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తోందని, ఈ నూతన వాస్తవికతను అందరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోనూ భవిష్యత్తులో ఈ తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జాతికి ఇచ్చిన 8 పొదుపు సూచనలను రాష్ట్ర ప్రజలందరూ పాటించాలని ఆయన పిలుపునిచ్చారు.




ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండి ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అమరావతిలోని నిడమర్రులో బుధవారం బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (బైసర్) శంకుస్థాపన

- మిగతా 2లో..

## రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనలో ఎంఎస్ఎంఈలదే కీలక పాత్ర

- 'మేడ్ ఇన్ ఆంధ్ర - మేడ్ ఫర్ ఇండియా - మేడ్ ఫర్ ది వరల్డ్'.. ఇదే మా ధ్యేయం: నారా లోకేష్
- 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు
- వచ్చే మూడు నెలల్లో 100 ఏపీ కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ కావాలని లక్ష్యం
- 'ఒకే రాజధాని-అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదంతో 22 క్లస్టర్ల ఏర్పాటు

అమరావతి - ఆంధ్రనాడు, మే 13


ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ బృహత్కార్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాత్ర అత్యంత కీలకమని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. "మేడ్ ఇన్ ఆంధ్ర -- మేడ్ ఫర్ ఇండియా -- మేడ్ ఫర్ ది వరల్డ్" అనే నినాదాన్ని సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (చీూజు), ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీఐఐ సంయుక్తంగా విజయ వాడలో నిర్వహించిన ఎస్ఎంఈ ఐపీఓపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



### యువగళం యాత్రే స్ఫూర్తి

తన యువగళం పాదయాత్రే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి స్ఫూర్తినిచ్చిందని లోకేష్ వివరించారు. "3132 కిలోమీటర్ల పాదయాత్రలో ఎందరో ప్రజల కష్టసుఖాలు చూశాను. పెనుగొండలో కియా అనుబంధ సంస్థలో పనిచేస్తున్న పద్మావతి అనే సోదరి తన అనుభవాన్ని పంచుకుంది. కియా రాకముందు గృహిణిగా ఉన్న ఆమె, పరిశ్రమ వచ్చాక ఉద్యోగంలో చేరి

- మిగతా 2లో..



## కనీస మద్దతు ధర రైతులకు ఊరటనిచ్చే నిర్ణయం

- మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి - ఆంధ్రనాడు, మే 13

వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రైతులకు ఊరటనిచ్చే నిర్ణయమని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం లక్ష్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు

- మిగతా 2లో..

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం



(మొదటిపేజీ తరువాయి)

జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత ఉధయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వానికి మెజార్టీ లేదని, మా కూటమిలో ఉన్న పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. అంతే కాకుండా ఎంఎల్ఎలను కొనుగోలు చేస్తూ రాష్ట్ర పరువును తీస్తున్నారని విమర్శించారు. బలపరీక్షపై చర్చ తర్వాత సిఎం విజయ్ మాట్లాడారు. టివికె నేతృత్వంలోని ప్రభుత్వం ఐదేళ్లూ ఉంటుందని, లౌకిక విధానానికి కట్టుబడి ఉంటామన్నారు. తమ ప్రభుత్వం వేగవంతమైన గుర్రం తరహాలో పనిచేస్తుందని, కానీ హార్స్ ట్రేడింగ్‌కు పాల్పడదని చెమత్కరించారు. గత ప్రభుత్వాలకు చెందిన అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**సిఎం ఒఎస్‌డి రాధన్ పండిట్ తొలగింపు..**

సిఎం విజయ్ ఒఎస్‌డి జ్యోతిషుడు రిక్కీ రాధన్ పండిట్ వెట్రివేల్ నియామకం తీవ్ర వివాదాస్పదం అయింది. మిత్రపక్షాలు కూడా రాధన్ పండిత్ నియామకాన్ని విమర్శించాయి. దీంతో విజయ్ ప్రభుత్వం ఆయన నియామకాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ?అన్నాడిఎంకె రెబల్ ఎంఎల్ఎలు తొలగింపు తమిళనాట రాజకీయం మరింత వేడెక్కింది. అన్నాడిఎంకెలో సంక్షోభం ముదిరింది. అసెంబ్లీలో బలపరీక్ష సందర్భంగా విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరుగడంతో ఆ పార్టీ అధినేత ఎడప్పాడి కె పళనిస్వామి బుధవారం చర్యలు చేపట్టారు. 13 మంది సిట్టింగ్ ఎంఎల్ఎలు, ఎస్పి వేలుమణి, సివి షణ్ముగం, విజయ్ భాస్కర్ వంటి నాయకులతో సహా మొత్తం 25 మంది నేతలను పార్టీ నుండి బహిష్కరించారు.

# సైబర్ నేరాలు అరికట్టండి

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ అంశంపై అవసరమైతే రిజర్వు బ్యాంకును సంప్రదించాలని తెలిపారు. ఆర్థిక, సైబర్ నేరాల్లో ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయనే అంశంపై సిఎం కొన్ని సూచనలు చేశారు. ఆధార్ అథంటికేషన్, కెవైసి వంటివి లేకుండా ప్రారంభిస్తున్న షెల్ కంపెనీలపై అధ్యయనం చేయాలన్నారు. బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖల సమన్వయంతో ఆన్ లైన్ ఆర్థిక మోసాల విషయంలో ఓ నియమావళిని సిద్ధం చేయాలని నిర్దేశించారు. అనుమానిత బ్యాంకు ఖాతాలను ఫ్లాగ్ చేసే అంశాన్ని పరిశీలించి, ఖాతాదారుల ప్రయోజనాలు రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యుపిఐ పేమెంట్స్ ద్వారా మిలియన్ల సంఖ్యలో ఆర్థిక లావాదేవీలు క్షణాల్లో జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ అంశంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో ఎపిటిఎస్ ముఖ్య భూమిక పోషించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీలను అధ్యయనం చేయాలని సూచించారు.

అన్ని బ్యాంకులు వారాంతాల్లో పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలపై దృష్టి పెట్టాలని చెప్పారు. కొన్ని నిబంధనల్ని మార్చుకునే విషయంలో రిజర్వు బ్యాంకును సంప్రదించాలని అన్నారు. హర్యాణా, మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాల్ని అధ్యయనం చేసి ఓ నిర్దిష్టమైన కార్యాచరణ సిద్ధంచేయాలని చెప్పారు. దీంతో పాటు ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఈ తరహా నేరాలకు సంబంధించి 9.29 లక్షల కాల్స్ బాధితుల నుంచి 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు వచ్చాయని, ఇప్పటి వరకు రూ.652కోట్లు బాధితులు కోల్పోయారని డిజిపి హరీష్ కుమార్ గుప్తా వివరించారు. సిఐడి సైబర్ క్రైమ్ విభాగం-బ్యాంకర్లతో కలిసి రూ.116 కోట్ల పైచిలుకు మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా కాపాడగలిగినట్లు తెలిపారు. ఈ నేరాల నియంత్రణ కోసం రాష్ట్ర స్థాయిలో సిఐడి సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పని చేస్తోందని, విజయవాడ, విశాఖ, తిరుపతిలలో సైబర్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా డేటాకు రక్షణ కల్పిస్తున్నామని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. ఈ సమీక్షలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కెపిసి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# కనీస మద్ధతు ధర రైతులకు ఊరటనిచ్చే నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

రైతుల్లో నూతన నమ్మకాన్ని పెంచుతున్నాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్ పంటల ఎంఎస్‌పి పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల 60 వేల కోట్ల భారీ వ్యయాన్ని ఆమోదించడం రైతుల పట్ల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పెట్టుబడి ఖర్చుకు కనీసం 50 శాతం లాభం జోడించి ఎంఎస్‌పి ధరలు నిర్ణయించడం రైతులకు నిజమైన భరోసా కల్పించే చర్యగా అభివర్ణించారు. వరి కామన్ రకానికి క్వింటాలుకు రూ.72 పెంచి రూ.2,441, గ్రేడ్-ఎ వరికి రూ.2,461 నిర్ణయించడం రైతులకు లాభదాయకమని తెలిపారు. జొన్నకు రూ.4,073, రాగికి రూ.5,205, సజ్జలకు రూ.2,900, ఉలవలకు రూ.8,200, మొక్కజొన్నకు రూ.2,410, నువ్వులకు రూ.10,346, సన్‌ఫ్లవర్‌కు రూ.8,343, పత్తికి రూ.8,667, వేరుశనగకు రూ.7,517 వరకు ఎంఎస్‌పి పెంపు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనలో

# ఎంఎస్ఎంఈలదే కీలక పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

నెలకు రూ.30 వేలు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ఆమె కథ విన్నాక ఉద్యోగ కల్పన ప్రాధాన్యం నాకు మరింత అర్థమైంది. ఆ ఆలోచన నుంచే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం పుట్టింది" అని లోకేష్ పేర్కొన్నారు.

**పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్**

గడిచిన 23 నెలల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని మంత్రి తెలిపారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. ఇప్పటివరకు 800 ప్రాజెక్టుల ద్వారా రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు కుదిరాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రూ.1.35 లక్షల కోట్ల చొప్పున పెట్టుబడులతో ముందుకొచ్చాయి. వాటికి శంకుస్థాపనలు కూడా జరిగాయి. రాయల్ ఎన్ఫీల్డ్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలతో పాటు పుట్టపర్తిలో ఫైటర్ జెట్ తయారీ కేంద్రం 'సావీజూ' ప్రాజెక్టు కూడా రాష్ట్రానికి రాబోతోంది" అని వెల్లడించారు. ఒక పెద్ద పెట్టుబడి వస్తే దాని చుట్టూ అనేక అనుబంధ పరిశ్రమలు ఎలా వస్తాయో వివరిస్తూ 'మల్టిప్లయర్ ఎఫెక్ట్' గురించి లోకేష్ మాట్లాడారు. "విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కారణంగా, దానికి అవసరమైన కూలింగ్ సిస్టమ్స్ సరఫరా కోసం క్యారియర్ కంపెనీ శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇదే మల్టిప్లయర్ ఎఫెక్ట్," అని ఆయన వివరించారు.

**అభివృద్ధి వికేంద్రీకరణే ప్రభుత్వ లక్ష్యం**

'ఒకే రాజధాని -- అభివృద్ధి వికేంద్రీకరణ' అనేదే ప్రభుత్వ విధానమని లోకేష్ స్పష్టం చేశారు. "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నాం. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. రాయలసీమలో ఆటోమొబైల్, కోస్తాలో ఆక్వా, ఉత్తరాంధ్రలో ఫార్మా, డేటా సెంటర్లు వంటి రంగాలపై దృష్టి సారించాం. నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయబోతున్నాం," అని తెలిపారు.

**ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ అండ**

"మాకు గూగుల్ ఎంత ముఖ్యమో, రూ.50 లక్షల పెట్టుబడితో మొదలయ్యే చిన్న పరిశ్రమ కూడా అంతే ముఖ్యం. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు పయనిస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు ఏ కష్టం వచ్చినా తాను ఒక మెసేజ్ దూరంలో ఉంటానని" భరోసా ఇచ్చారు. రాబోయే మూడు నెలల్లో కనీసం 100 ఎంఎస్ఎంఈ కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ అయ్యేలా ఎంఎస్ఎంఈ శాఖ కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు లోకేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయులు, కేశినేని శివనాథ్, ఎన్ఎస్ఈ సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని

# ప్రోత్సహించాలి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రధాని సూచనల మేరకు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని చంద్రబాబు అన్నారు. "దేశం మొత్తం దుబారాను తగ్గించాలి. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ప్రజాప్రతినిధులు కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ఆదర్శంగా నిలవాలి. భద్రతను కూడా కుదించుకోవాలి" అని ఆయన హితవు పలికారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, బంగారం కొనుగోళ్లపై కూడా ప్రజలు ఆలోచించాలని సూచించారు. మన దేశంలో, రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని, విదేశాలకు బదులు స్వదేశీ పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు ఎంతో అందమైనవని, సూర్యలంకను గోవాను మించిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. "నా దేశం - నా బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు.

**అమరావతికి వైద్య, విద్య హబ్ గుర్తింపు**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులన్నీ ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత తమదని, పారిశ్రామికవేత్తలు వేగంగా నిర్మాణాలు పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ తిరుగులేని శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. "ప్రపంచంలోని ప్రతి ముగ్గురు వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిలో ఒకరు అమరావతి నుంచే తయారుకావాలి," అని ఆయన తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. బైసర్, కిమ్స్ సంస్థలు ఈ లక్ష్య సాధనకు దోహదపడతాయన్నారు. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, నైపుణ్యాభివృద్ధి ద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించేలా ఈ సంస్థలు విస్తరించనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది ఇదే రోజున కిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు.

**క్వాంటమ్ వ్యాలీతో కొత్త శకం**

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రాబోతోందని, ఇది దేశంలోనే ఒక నూతన అధ్యాయమని చంద్రబాబు అన్నారు. "ఈ ఏడాది డిసెంబర్ నాటికి మన దేశంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటర్‌కు ఏపీ చిరునామాగా మారుతుంది. రెండేళ్లలో అమరావతి నుంచి ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్లు సరఫరా చేస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి సంస్థలు ఇప్పటికే పనులు ప్రారంభించాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ ప్రాజెక్టులతో రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, తన జీవితంలో అలాంటి అరాచక పాలనను చూడలేదని విమర్శించారు. తన ప్రభుత్వ లక్ష్యం పిల్లల భవిష్యత్తు, యువతకు ఉద్యోగాలేనని స్పష్టం చేశారు. గత పాలకులు ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ భారం మోపారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచలేదని, భవిష్యత్తులో కూడా పెంచబోమని హామీ ఇచ్చారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. అమరావతిని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని, విశాఖను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్, టెక్నాలజీ హబ్‌గా మారుస్తామని, 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 24 లక్షల ఉద్యోగాలు సృష్టించే లక్ష్యంతో పనిచేస్తున్నామని చంద్రబాబు వివరించారు.

# ఆర్ధిక వ్యవస్థ పటిష్టతే లక్ష్యం

**- ఏపీ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు.. - ఇకపై నెల నెలా డేటా సేకరణ -**

**- సామర్థ్యం పెంపుపై సీఎం చంద్రబాబు దృష్టి**

**- పటిష్ట ఆర్థిక వ్యవస్థకు సామర్థ్యం పెంపే మార్గం**

**- రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రతీ నెలా గణాంకాల సేకరణ**

**- రాష్ట్రం నుంచి మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ**

**- ఆర్థిక విశ్లేషణకు ఏఐ టెక్నాలజీ వినియోగం**

**- 15 శాతం వృద్ధి సాధించి స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన**

**అమరావతి - ఆంధ్రనాడు, మే 13**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 15 శాతం వృద్ధిరేటును స్థిరంగా సాధించడం ద్వారానే స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని చేరుకోగలమని, దీనికోసం క్షేత్రస్థాయి నుంచి పక్కాగా, వేగంగా గణాంకాలు సేకరించాలని సూచించారు. బుధవారం నాడు సచివాలయంలో ప్రణాళిక శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే పూర్తిస్థాయి 'డేటా డ్రివెన్ గవర్నెన్స్'కు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం త్రైమాసిక, వార్షిక ప్రాతిపదికన రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) అంచనాలు రూపొందిస్తున్నారని, దీనివల్ల వాస్తవ ఆర్థిక పరిస్థితిపై తక్షణ అవగాహన కలగడం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఆధారపడటం వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ విధానాన్ని మార్చి, ప్రతీ నెలా రాష్ట్ర ఆర్థిక వృద్ధిని జిల్లా, మండల స్థాయిలో ట్రాక్ చేసేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఇందుకోసం జీఎస్‌డీపీ విధానాన్ని అర్థం చేసుకునేలా, రియల్‌టైమ్ పద్ధతిలో అంచనాలు రూపొందించేలా అధికారులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని 5 జోన్లు, 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలను కవర్ చేస్తూ ఈ శిక్షణ ఉండాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా తీర్చిదిద్దాలని సూచించారు. మరోవైపు, వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం పర్యవేక్షణలో లేని ఆర్థిక సూచికలను కూడా గుర్తించి, వాటిని కూడా ట్రాక్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమీక్షలో జీఎస్‌డీపీ సామర్థ్య పెంపు, రాబోయే సర్వేలు, కేపీఐల ఆడిటింగ్ వంటి పలు కీలక అంశాలపై చర్చించారు.

## ఇజ్రాయిల్ సైన్యం

# డ్రోన్లతో కార్లపై దాడి

## - ఎనిమిది మృతి

**లెబనాన్ - ఆంధ్రనాడు, మే 13**

ఇజ్రాయిల్ సైన్యం లెబనాన్ పౌరుల్ని లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతోంది. బుధవారం బీరూట్ -- దక్షిణ లెబనాన్‌ని కలిపే ప్రధాన రహదారిపై వెళుతున్న కార్లపై ఇజ్రాయిల్ సైన్యం మూడుసార్లు డ్రోన్ల దాడికి పాల్పడింది. దీంతో ఇద్దరు చిన్నారులతో సహా ఎనిమిది మంది మృతి చెందారు. ఈ విషయాన్ని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. లెబనాన్ రాజధాని బీరూట్‌కి దక్షిణంగా సుమారు 20 కిలోమీటర్ల (12 మైళ్ల) దూరంలో ఉన్న జియే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఇజ్రాయిల్ పాల్పడిన డ్రోన్ల దాడికి కార్లు ధ్వంసమయ్యాయి. ఈ బాంబు దాడికి కార్ల బాహ్యాభాగాలు కాలిపోయి, ముక్కలయిపోయాయి వీటికి సంబంధించిన ఫొటోలను లెబనాన్ జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ దాడులు మరింత ఉద్రిక్తతలకు కారణమవుతాచపి అల్‌జజీరా ప్రతినిధి జైనా ఖోద్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, లెబనాన్, ఇజ్రాయిల్ బహుశా అమెరికా మధ్యవర్తిత్వంతో వాషింగ్టన్‌లో గురువారం మరో దఫా చర్చలు జరగనున్నాయి. అయితే హెజ్బుల్లా అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగే చర్చలను వ్యతిరేకిస్తోంది. మరోవైపు బుధవారం ఉదయం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని మీస్ ఎల్-జబల్, యానూహ్, బుర్జ్ షెమాలి, హులా, డెబ్ల్, అబ్బాసియ్యే ఆరు గ్రామాలు నివాసితులను బలవంతంగా తమ గ్రామాలను వదిలి వెళ్లిపోవాలని హెచ్చరించింది. అక్కడి నుంచి వెళ్లకపోతే నివాసితులను బలవంతంగా తరలిస్తామని, ఆ గ్రామాల నుంచి వెయ్యి కిలోమీటర్ల దూరంలోకి వెళ్లాలని, లేకపోతే తమ ప్రాణాలను ప్రమాదంలోకి పడేసుకున్నట్లేనని ఇజ్రాయిల్ బెదిరించింది.

# పెరగనున్న ఎండల తీవ్రత

**అమరావతి - ఆంధ్రనాడు, మే 13**

రాష్ట్రంలో ఎండ తీవ్రత, వడగాడ్పులు మరింత పెరగనున్నాయని, గురువారం గరిష్టంగా 43 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం, పోలవరం జిల్లాలోని చింతూరు, కూనవరం, గుర్తేడు మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ఒక మండలంలో తీవ్ర వడగాడ్పులు, 15 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు అల్పపీడనం ప్రభావంతో గురువారం నుంచి రెండు రోజులపాటు రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

## మంచినీటి కోసం మహిళల నిరసన



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 13 :** తమ గ్రామంలో మంచినీటి సమస్య ఎవరూ పట్టించుకవడం లేదని బుధవారం మండలంలోని బొమ్మలకుంటకు చెందిన మహిళలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం మందు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో బోరుమోటర్ మరమ్మత్తుకు గురై సుమారు 6నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా వుండడంతో వ్యవసాయ బోర్ల వద్ద మంచినీటి కోసం వెళ్ళి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా రోజులైనా ఎవరూ స్పందించకపోవడంతో నిరసన చేస్తున్నట్టు చెప్పారు. చివరకు పంచాయతీ కార్యదర్శి లత స్పందించి రెండ్రోజుల్లో కొత్తమోటర్ అమర్చి గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు.

## స్వచ్ఛ పథం కార్యక్రమంతో పారిశుధ్య పనులు



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 13 :** స్వచ్ఛ పథం కార్యక్రమంతో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి బుధవారం అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్న స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా మండలంలో ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది చేపట్టారు. రోడ్డుపక్కల చెత్తాచెదారాలను శుభ్రం చేశారు. గ్రామంలోపల ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను చేపట్టారు. ఎంపీడీవో బాలాజీ చలమంగళం, రాయలపేట, కోగిలేరు పంచాయతీలలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి రాయలపేట, తుర్లపల్లి గ్రామపంచాయతీలలో పర్యటించారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ఆరోగ్య గ్రామాలుగా నిలపడానికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి బుధవారం రోజు ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

## రేణిగుంటలోరైల్వే వంతెన ప్రారంభం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 13:** రేణిగుంట సమీపంలో రైల్వే వంతెన మరమత్తు పనులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ప్రారంభించారు. దీంతో రహదారిలో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. రేణుక సమీపంలో గత నెల రోజుల క్రితం రైల్వే వంతెన మరమ్మతుల కారణంగా మూసివేసిన విషయం తెలిసిందే. రైల్వే వంతెన రహదారి ప్రారంభించడంతో శ్రీకాళహస్తి కోడూరు పుత్తూరు పాపానాయుడుపేట తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఆర్టిసి బస్సులు యధావిధంగా రాకపోకలు కొనసాగిస్తున్నా యి. ఈ సందర్భంగా అధికారులు రేణిగుంట సర్కిల్ ఇన్స్పెక్టర్ జయచంద్ర, ఎంపీడీవో రవిచంద్ర, తాసిల్దార్ శ్యాం ప్రసాద్, రైల్వే అధికారులకు తెలుగుదేశం పార్టీ నాయకులు సాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముని చంద్రారెడ్డి, డి. విశ్వనాథన్, నవాబ్, మహబూబ్ బాషా, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## "మన బడి -మన భవిష్యత్తు"తో రూపురేఖలు మారనున్న ప్రభుత్వ పాఠశాలలు : ఎమ్మెల్యే పులివర్తి నాని



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 13:** మనబడి – మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ధాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారనున్నాయని యంయల్ఏ పులివర్తి నాని అన్నారు. రామచంద్రాపురం మండలం, అనుపల్లి గ్రామంలో ప్రభుత్వ మోడల్ ప్రైమరీ స్కూల్ భవనాల భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా విచ్చేసారు. అనుప్పల్లి పంచాయతీ, ఉప్పలివంక గ్రామానికి చెందిన దివంగతులు కె పెద్ద చిన్నమ రెడ్డి, పెద్దక్క, గంగిరెడ్డి, జయలక్ష్మిల జ్ఞాపకార్థం వారి వారసులు ప్రముఖ సీనియర్ న్యాయవాది కె. రఘునాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు పాఠశాలకు అవసరం అయ్యే భవనాల పూర్తి నిర్మాణానికి దాతలుగా ముందుకు రావడం శుభ పరిణామంగా స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నానికి దాత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. యంయల్ఏ దాత కుటుంబ సభ్యులతో కలిసి భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యంయల్ఏ నాని మాట్లాడుతూ ఉప్పలివంక గ్రామానికి చెందిన న్యాయవాది కె.రఘునాథరెడ్డి తమ పెద్దల జ్ఞాపకార్థం పాఠశాల భవనాల నిర్మాణమే కాక, మౌలిక వసతులను కల్పించటానికి చేయూతనివ్వడం శుభ పరిణామం అని అన్నారు.తాను చిన్నతనంలో చదువుకున్న పాఠశాల అభివృద్ధి చేయటానికి ముందుకు వచ్చిన రఘునాథ్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. రఘునాథ రెడ్డి దాతృత్వం మరింత మందికి ఆదర్శం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకొనే అదృష్టం తమకు కలగటం ఎంతో ఆనందంగా ఉందని దాత రఘునాథరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపేత యజ్ఞంలో ప్రభుత్వానికి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. దాతను, ఎ



మ్మెల్యేని స్థానికులు శాలవులు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కేవియన్ కుమార్, దాతల కుటుంబ సభ్యులు ఇందిర, మాజీ యంపిపి బిందుమాధవి, విశ్రాంత ఉపాధ్యాయులు నాయుడు మునిరత్నం నాయుడు, బండి విజయ కుమార్, గుర్రం దేవరాజులు రెడ్డి, బండి అన్నా రెడ్డి, ఆకా దేవరాజులు, పంతల వెంకటేశు నాయుడు, జవ్వాది ప్రకాష్, సోమురాయల్, కె సోమశేఖర్, మధుసూదన్ రెడ్డి, నరసింహారెడ్డి, జి నరేష్, నీటి సంఘం అధ్యక్షులు పచ్చార్ల జగదీష్ రాయల్, బిసి సెల్ అధ్యక్షులు కుమ్మర కుమార్, సిరిపిరిరెడ్డి కృష్ణా రెడ్డి, కోనగిరి పుషోత్తం, యల్ రూపు రాయల్, బి మునిరాజ, మధు, పెద్ద ఎత్తున గ్రామస్తులు, విద్యాశాఖ అధికారులు, ఐసీడీయస్ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జెడ్పిపిఎఫ్ బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి

**పలమనేరు, ఆంధ్రనాడు, మే 13:** ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలలో నిల్వ ఉన్న బకాయిల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్. సోమచంద్రా రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘ సభ్యులతో కలిసి పలమనేరులోని సంఘ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2021,2022 సంవత్సరాలలో పదవీ విరమణ చేసిన వారికి మొదటి విడత చెల్లింపులు చేసారని, అయితే తదుపరి జమ అయిన నెలసరి చందాలు, కరువు భత్యం బకాయిలు ఖాతాలలో చూపారని వాటిని చెల్లించాలని గత మే జూన్ 2025లో దరఖాస్తు చేస్తే ఇంతవరకు వాటిని ప్రాసెస్ చేయలేదన్నారు. ప్రభుత్వం 2026 ఫిబ్రవరి వరకు పదవీ విరమణ పొందిన వారికి మార్చి 2026లో చెల్లించారని అయితే పాత వారికి ఇంకా చెల్లించకపోవడం సరికాదన్నారు. సభ్యులు పుష్పరాజ్, శ్రీనివాసులు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన వారు ఆరోగ్య, కుటుంబ పోషణ సమస్యలు ఎదుర్కొంటున్నారని అటువంటి వారికి




పెండింగ్ లేకుండా బకాయిలు చెల్లించాలన్నారు. దీనితో పాటు ప్రభుత్వం పిఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఐ.ఆర్. ప్రకటించ లేదని, పిఆర్‌సి కమిషన్ నియమించలేదని, నాలుగు విడతల డి.ఏలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగ భూషణం, రాజారెడ్డి, రాజశేఖర్, రామప్ప, భాస్కర్ రెడ్డి, బిఆర్ శ్రీనివాసులు, నారాయణబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం

### -ఎంపీ గురుమూర్తి కృషితో రానున్న రైల్వే అండర్ బ్రిడ్జి

**తిరుపతి – ఆంధ్రనాడు, మే 13:** తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కీలకమైన ఎల్సీ నం.107 పాత హీరో హోండా షోరూం వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్న ఈ అండర్ బ్రిడ్జ్ ద్వారా నగర ట్రాఫిక్‌కు భారీ ఉపశమనం కలగనుంది. ఇదే సమయంలో కొత్తగా మంజూరు అయిన అప్రోచ్ రోడ్డు పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ఈ అండర్ బ్రిడ్జ్ పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తే తిరుపతి నగరంలో ట్రాఫిక్ మరింత మెరుగుపడుతుంది.భవిష్యత్ ట్రాఫిక్ రద్దీని గుర్తించి ఎంపీ గురుమూర్తి మద్దిల గురుమూర్తి తాను ఎంపీగా ఎన్నికైన తొలినాళ్లలో 2022 సంవత్సరంలోనే ఎల్సీ నం.107 వద్ద అండర్ బ్రిడ్జ్ నిర్మాణం



అత్యవసరమని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు తెలియజేశారు. 2023లో ఈ సమస్యను మరింత ప్రాధాన్యతతో తీసుకుని, రోడ్డు వెడల్పు పెంపు అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. రైల్వే గేట్లు మూసినప్పుడు ప్రధాన రహదారి పూర్తిగా బ్లాక్ అవుతూ అంబులెన్సులు సైతం సమయానికి ఆసుపత్రులకు చేరలేని పరిస్థితిని ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో రైల్వే శాఖ కూడా సమస్య తీవ్రతను గుర్తించి, ఎల్సీ నం.107 వద్ద రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది.ఆర్‌యూబీ నిర్మాణం పూర్తి దశకు చేరుకోవడం, అప్రోచ్ రోడ్ల పనులు ప్రారంభం కానుండటంతో తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. రైల్వే గేట్ల కారణంగా ఏర్పడే ఆలస్యం పూర్తిగా తొలగిపోవడంతో పాటు, అత్యవసర సేవలు వేగంగా అందుబాటులోకి రావడం, ప్రజలకు సురక్షితమైన ప్రయాణం కలగడం వంటి అనేక ప్రయోజనాలు అందనున్నాయి. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి నిరంతరం అనుసరణతో, దశలవారీగా సమస్యను ముందుకు తీసుకెళ్లి, సబ్‌వే ప్రతిపాదన నుండి ఆర్‌యూబీ నిర్మాణం వరకు, అనంతరం అదనపు అప్రోచ్ రోడ్ల ఆమోదం వరకు సాధించిన ఈ విజయాన్ని ప్రజలు అభినందిస్తున్నారు. నగర అభివృద్ధి, ప్రజల సౌకర్యం దృష్ట్యా ఆయన చేసిన కృషి తిరుపతి ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో కీలక మైలురాయిగా నిలిచింది.




## ఏ.పి.ఆర్.జే.సి. - 2026 ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో "విశ్వం" సంచలన విజయం



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 13:** రాష్ట్ర స్థాయిలో 2026 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ప్రవేశాల కోసం ఏప్రిల్ 24న నిర్వహించిన ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యా సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో పాటు టాప్–20లో 15 ర్యాంకులు సాధించి తిరుపతి "విశ్వం" విద్యా సంస్థలు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నాయి.విద్యార్థుల్లో వి. మోక్షిత్ రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించగా, టి. శ్రీ దర్శిని రాష్ట్ర 8వ ర్యాంకు, కే. పవ్యశ్రీ 9వ ర్యాంకు, కే. హర్షవర్ధన్ 11వ ర్యాంకు, కే. జ్యోత్స్న 12వ ర్యాంకు, ఎన్. హాసిని 13వ ర్యాంకు, ఈ. మునిశంకర్ 14వ ర్యాంకు, బి. హర్షిత్ 15వ ర్యాంకు, పి. తేజస్వి 16వ ర్యాంకు, కే. హర్ష 17వ ర్యాంకు, వి. పూజ 18వ ర్యాంకు, ఎం. చారుణ్య మరియు కే. గీతిక 19వ ర్యాంకు, ఏ. రితీష్ కుమార్ మరియు కే. ధోనీష్ 20వ ర్యాంకులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ, పోటీ పరీక్ష ఏదైనా రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించడం విశ్వం విద్యార్థులకు ఆనవాయితీగా మారిందన్నారు. గత 36 సంవత్సరాలుగా సంచలన ఫలితాలు సాధిస్తూ విద్యారంగంలో కొత్త రికార్డులు సృష్టించడం తమ సంస్థ ప్రత్యేకత అని తెలిపారు.విద్యార్థుల విజయాలకు కృషి చేసిన అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ, స్ఫూర్తిదాయకమైన విద్యను అందించడం "విశ్వం" విద్యా సంస్థల లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, ఎన్. విశ్వశ్రీ, కరస్పాండెంట్ తులసి విశ్వనాథ్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## గుండె పోటుతో జూనియర్ లైన్ మెన్ మృతి



**చంద్రగిరి - ఆంధ్రనాడు,మే 13 :** చంద్రగిరి రూరల్ సెక్షన్ లో జూనియర్ లైన్ మ్యాన్‌గా పనిచేస్తుండిన రవీంద్ర గుండె పోటుతో మృతి చెందాడు. నెల్లూరు శిక్షణా కేంద్రములో శిక్షణ పొందుతూ వుండగా ఆకస్మికంగా గుండెపోటు రావడమైనది. ఈ వార్త అందరినీ విస్మయానికి గురిచేస్తూ జీర్ణించుకోలేక పోతున్నారు. రవీంద్ర పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అశ్రునయనాలతో కోరుకుంటున్నారు.

## వాటర్ ట్యాంక్ ను శుద్ధి చేసే క్రమంలో అదుపు తప్పి యువకుడు మృతి

**వాజిత్ మృతికి సంతాపం వ్యక్తం చేసిన బైరెడ్డిపల్లి మండల టైలర్ యూనియన్**



**బైరెడ్డిపల్లి - ఆంధ్రనాడు, మే13:** మండల కేంద్రమైన బైరెడ్డిపల్లిలో చంద్రబాబు కాలనీకి చెందిన ప్యారు కుమారుడు వాజిత్(22) తమ నివాసం పై ఉన్న వాటర్ ట్యాశీక్ ను మే 06 వ తేదీ శుద్ధి చేస్తున్న క్రమంలో అదుపుతప్పి పై నుండి కిందకు పడ్డాడు. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన బెంగళూరు హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు సమాచారం. దీనిపై కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్ట్‌కు పంపినట్టు బైరెడ్డిపల్లి పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

## బైరెడ్డిపల్లిలో జైకిసాన్ ఎరువుల దుకాణం ప్రారంభం



**బైరెడ్డిపల్లి - ఆంధ్రనాడు, మే 13:** మండల కేంద్రమైన బైరెడ్డిపల్లి లో పుంగనూరు కు వెళ్లే రోడ్డులో బుధవారం జై కిసాన్ ఆగ్రో ఎరువుల నూతన శాఖను జోనల్ మేనేజర్ అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. పురోహితులు మురళీధర్ ఆచార్యులు సుద్ది పుణ్యా వచనం, నవగ్రహ పూజ, వాస్తు పూజ,లక్ష్మీపూజ చేశారు. ఈ సందర్భంగా ఏరియా మేనేజర్ శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతపు రైతులకు సరసమైన ధరలకు అధిక దిగుబడులను ఇచ్చే పంటలకు ఎరువులు, విత్తనాలను సరఫరా చేసి, రైతుల అభివృద్ధి తమ లక్ష్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మేనేజర్ మోహన్, పలమనేరు మేనేజర్లు శ్రీనివాసులు, రాజేష్ మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఎనిమిది మంది పేకాట రాయుళ్ళు అరెస్టు

**తంబళ్లపల్లి - ఆంధ్రనాడు, మే 13:** పేకాట స్థావరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అరెస్టు చేసి రూ. 33,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. తంబళ్లపల్లి మండలం కోటకొండ అటవీ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజా రమేశ్ ఆదేశాలతో బుధవారం మధ్యాహ్నం స్పెషల్ బ్రాంచ్, స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ. 33,900 నగదు, 5సెల్ ఫోన్లు,2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

## దామినేడు ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు



**- ఆన్‌లైన్ హాజరు, సేవలపై కమిషనర్ తనిఖీ**

**- ఆరోగ్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యం.. వీర పాండ్యన్**

**తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, మే 13:** తిరుపతి పర్యటనలో భాగంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీర పాండ్యన్ బుధవారం దామినేడు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మసీ రిజిస్టర్లు, ఆసుపత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది ముఖ ఆధారిత ఆన్‌లైన్ హాజరును తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల పనితీరు, ప్రగతిపై వైద్యాధికారి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల అమలు, రికార్డుల నిర్వహణ పట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ అన్ని వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ అప్లికేషన్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సెల్వియా, డీపీఎంఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, సీహెచ్‌వో రత్నాకర్, డీపీఓ ప్రకాష్, దామినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు మనిషి జీవనానికి ఆధారభూతాలు



**చంద్రగిరి - ఆంధ్రనాడు, మే 13:** మనిషి జీవనానికి మొక్కలు ఆధారభూతాలని నర్సరీ గ్రోయర్ అసోసియేషన్ సభ్యులు గోపాలం రవీంద్ర అన్నారు. చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలో ఆంధ్రప్రదేశ్ నర్సరీ గ్రోయర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం గోపాలం రవీంద్ర గారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నర్సరీ గ్రోయర్స్ కు సహాయం అందించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించారు. నర్సరీ పెంపకం దారులకు ముఖ్యంగా నీరు, విద్యుత్తు, అధిక ధరలు, మార్కెటింగ్ లాంటి సమస్యలతో పాటు వాతావరణ ప్రతికూలత, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే వారిని ఆదుకోవాలని కోరారు. అసోసియేషన్ కంపెనీ చట్టాల పరిధిలో మొక్కల పెంపకం, అమ్మకాలు పెంచడానికి ప్రయత్నిస్తామన్నారు. నర్సరీ మొక్కలకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. దీంతోపాటు నర్సరీలో ఆర్గానిక్ ఉత్పత్తులను అమ్మటం ద్వారా ఆర్థికంగా ఊతం కలుగుతుందన్నారు. నర్సరీ పెంపకానికి అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని అసోసియేషన్ అందిస్తుందన్నారు. మనిషికి మొక్కలకు అభినవభావ సంబంధం ఉంటుందని చెప్పారు. సంఘం స్ఫూర్తితో పరిచయాలతో ఒకరికొకరు సహాయం చేసుకోవడమే ప్రామాణికంగా ఉండాలన్నారు. అంతరించిపోతున్న అరుదైన మొక్కలను, ఔషధ గుణాలు కలిగిన మొక్కలకు జీవం పోసి ప్రజలకు అందుబాటులో తక్కువ ధరలకు అందించడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా ఆకుల చలపతిరావు, ఉపాధ్యక్షులుగా సరిత విజయవాడ, ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి దర్శి, సహాయ కార్యదర్శులుగా చాంతాటి రమేష్ శ్రీకాకుళం, బండిఅన్నరవి అంగళ్లు, కోశాధికారిగా మన్నే శ్రీనివాసరావు విజయవాడ, సమన్వయకర్తగా లక్ష్మీనారాయణ బాపట్ల, పౌరు సంబంధాల అధికారిక రాజ్ కుమార్ విజయవాడ, కార్యవర్గ సభ్యులుగా రంగస్వామి పాణ్యం, కృష్ణమూర్తి, జంగారెడ్డి గూడెం, ఆకివీడు ప్రసాద్, ఆకుల మునిరత్నం తిరుపతి, కాకినాడ వి ప్రసాద్, గుంటూరు ఉమా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలోనే సీనియర్ పాత్రికేయులు డాక్టర్ యం. ఆర్.యన్.వర్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో నర్సరీ అసోసియేషన్ అందుపుచ్చుకుని ప్రజలకు తక్కువ ధరలో మొక్కలు అందించాలని, సంఘం ఐక్యతే ముఖ్యమని తెలియజేసారు. కార్యక్రమంలో నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ స్థానిక నాయకులు హరికృష్ణ, కోటేశ్వరరావు, బాలరా వి, మునిరత్నం, మునిశేఖర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీపై తిరుపతిలో ఏఐడిఎస్ఓ నిరసన

**- ఎన్టీఏ రద్దు, జ్యుడీషియల్ విచారణకు డిమాండ్**




తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, మే 13: నీట్ (నీట్ ఎగ్జావి నేషన్) పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ ఏఐడిఎస్ఓ పిలుపు మేరకు బుధవారం తిరుపతి ఎంఆర్ పల్లి కూడలి గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలని, పేపర్ లీకేజీ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో రాష్ట్రాలే ప్రవేశ పరీక్షలు నిర్వహించే విధంగా విధాన మార్పులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐడిఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. రాహుల్, తిరుపతి జోనల్ కమిటీ అధ్యక్షులు తేజశ్రీ మాట్లాడుతూ, ఎన్టిఏను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిటీ కార్యదర్శి ధీరజ్ సింగ్, తులసి, మోహన్, మహేష్ జాన్, మోబిన్‌తో పాటు పలువురు నీట్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# వైభవంగా కోటకొండ గంగమ్మ తిరుణాల

**-అమ్మవారికి పట్టు వస్త్రాల సారె సమర్పించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సతీమణి కవితమ్మ**



**తంబళ్లపల్లి - ఆంధ్రనాడు, మే 13:** తంబళ్లపల్లి మండల కేంద్రానికి సమీపంలోని సంతోపులో వెలసిన కోటకొండ గంగమ్మ జాతరను బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. బుధవారం ఉదయం డప్పు వాయిద్యాలు మేళతాళాల నడుమ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారాకనాథ రెడ్డి సతీమణి కవితమ్మ స్థానిక మహిళలు, వైసీపీ నాయకులతో కలసి అమ్మవారికి పట్టు వస్త్రాల సారె, దీలు, బోనాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడి పంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని మొక్కుకుని పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి తంబళ్లపల్లి, పరశుతోపు గ్రామాల్లోని మహిళలు భక్తి శ్రద్దలతో దీలు, బోనాలను కాలి నడకన తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి పలు గ్రామాల ప్రజలు వివిధ అక్రుతులతో చాందినీ బళ్ళను కట్టి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఆలయం వరకూ మెరవణి చేశారు.



# ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్

**- రాస్ ఆధ్వర్యంలో వేమూరులో ఉచిత వైద్య పరీక్షలు**



తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, మే 13: తిరుపతి రూరల్ మండలం, వేమూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ క్యాంపు కో-ఆర్డినేటర్ హేమంత్ కుమార్ నేతృత్వంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించాల్సిన అవసరం ఉందని, వ్యాధి బారిన పడిన వారు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా చికిత్స తీసుకుంటే కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. మహిళల కోసం రాస్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మందులతో పాటు మనోధైర్యం కూడా వ్యాధిని జయించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వైద్యుడు డాక్టర్ వెంకయ్య బాబు మాట్లాడుతూ, ధూమపానం, మద్యపానం, పురుగు మందుల అవశేషాలు ఉన్న ఆహారం వంటి కారణాలతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. చిన్నారులు, మహిళలు కూడా ఈ వ్యాధి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. శిబిరంలో సుమారు 100 మందికి బీపీ, షుగర్, హెపటైటిస్, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే నిరుపేద వృద్ధులకు చేతికర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ ఆసుపత్రి సిబ్బంది, నాగేశ్వర్, సత్యనారాయణ, హేమావతి, క్లస్టర్ లీడర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతకానికి ఇల్లు దగ్ధం



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 13:** నాగలాపురం పట్టణంలోని పడమర హరిజన వాడలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పైన వేలు, శ్రీవల్లి గృహములో విద్యుత్ సర్కులేట్ అయి ఇల్లు మొత్తం విద్యుత్ ఘాతకానికి గురైంది. ఈ సంఘటనలో వేలు శ్రీవల్లి కూలి పనికి వెళ్లడంతో 12 సంవత్సరాల బాలుడు ఇంట్లో నిద్రపోతున్న సమయంలో విద్యుత్ సర్కులేట్ ఒక్కసారిగా మంటలు గృహము నుండి బయటకు రావడంతో చుట్టుపక్కల ఉన్న వ్యక్తులు వెంటనే ఇంటి లోపల ఉన్న బాలుడిని బయటికి తీసుకుని రావడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ ఆస్తి మాత్రం భారీ నష్టం జరిగింది. కూలి పని చేసుకునే జీవనం గడిపే వేలు శ్రీవల్లి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# విదేశాల్లో ఉద్యోగాలు

**- అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 13:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆ ధ్వర్యంలో ఇజ్రాయిల్, జర్మనీ, దుబాయ్ దే శాల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అ భ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనా థం ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయిల్‌లో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాలకు 25 నుం చి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జీడీఏ, ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ అర్హతలతో పాటు బేసిక్ ఇం గ్లీష్ పరిజ్ఞానం అవసరమని తెలిపారు. ఎం పికైన వారికి నెలకు రూ.1.99 లక్షల వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తులకు మే 15 చివరి తేదీ అన్నారు. జర్మ నీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు ఐటీఐ ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఉత్తీర్ణతతో పాటు రెం డేళ్ల అనుభవం కలిగిన 30 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపి కైన వారికి నెలకు రూ.2.6 లక్షల నుంచి రూ.2.7 లక్షల వరకు వేతనం ఉంటుందని, దరఖాస్తులకు మే 25 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. దుబాయ్‌లో టాక్సీ డ్రై వర్ ఉద్యోగాలకు పదో తరగతి ఉత్తీర్ణతతో బేసిక్ డ్రైవింగ్ నైపుణ్యాలు కలిగిన పురు షులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నెలకు ఏఈడి 4000 నుంచి 5000 వరకు ఆదా యం పొందే అవకాశం ఉందన్నారు. దరఖాస్తులకు మే 19 చివరి తేదీగా పేర్కొన్నా రు. ఆసక్తి గల అభ్యర్థులు పాస్పోర్ట్, విద్యార్హతలు, అనుభవ ధృవపత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9160912690, 9988853335 నంబర్లను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

# జనగణన సర్వేపై తనిఖీ చేసిన తహసిల్దార్ కవులేష్



**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 13:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేర కు జనాభా సర్వే గురించి రామ కుప్పంలో బుధవారం నిర్వహిం చారు ఈ కార్యక్రమం ఏవిధంగా జరుగుతున్నది రామకుప్పం తాసి ల్దార్ కౌలేష్ పరిశీలన చేశారు ప్ర జలను ఏ విధంగా సిబ్బంది ప్ర శ్నిస్తున్నారని ప్రభుత్వం నిర్ణయిం చిన విధంగానే సర్వే చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు కార్యక్రమం చురుకుగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు ఈ కార్యక్ర మంలో వీఆర్వోలు వినోద్ మహేంద్ర పంచాయతీ కార్యదర్శి సోమశేఖర్ ఉన్నారు.

## గిరిజనులకు వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం



**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 13:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ పరిశోధన తిరుపతి అఖిల భారత సమన్వయ పరిశోధన విత్తన పథకం అంశాలపై గిరిజన రైతులకు వివరించారు రామాపురం తండాలో గిరిజనులకు వ్యవసాయ ఉత్పత్తులు విత్తనాలు గురించి రైతులకు శాస్త్రవేత్తలు వివిధ పంటలలో మన్నికైన విత్తనాలు ఎంపిక సాంకేతిక పరిజ్ఞానం యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు విత్తనాలు వ్యవసాయానికి సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కదిరి మోహన్ డాక్టర్ సహజ దేవ్ వ్యవసాయ అధికారి బాలాజీ నాయక్ మరియు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# తయారీ రంగంలో రాష్ట్రంలో తిరుపతి జిల్లా ప్రత్యేక స్థానం

- పారిశ్రామిక అభివృద్ధికి బలమైన మౌలిక సదుపాయాలు
- తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికపై ఉన్నతస్థాయి సమీక్ష
- పరిశ్రమలు, ఉపాధి, పట్టణీకరణ సమగ్ర అభివృద్ధిపై దృష్టి
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా
- జిల్లా అభివృద్ధి, ఆర్థిక పురోగతిపై కలెక్టర్ పవర్



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 13:** తిరుపతి జిల్లా తయారీ రంగంలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే ఉన్నత స్థాయిలో ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టిఈఆర్) అభివృద్ధి ప్రణాళికపై జిల్లా ప్రధాన ప్రాజెక్టుల పురోగతిని ఆయన బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదాదేవి, డీఆర్ఓ నరసింహులు సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, తిరుపతి జిల్లాకు తయారీ రంగంలో ఉన్న బలమైన స్థానం సానుకూల సంకేతమని, భవిష్యత్ అభివృద్ధి కోసం వ్యవసాయం నుంచి పరిశ్రమలు, తదుపరి సేవా రంగానికి మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సేవా రంగం విస్తరణతో పెట్టుబడులు ఉపాధిగా మారి ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని తెలిపారు. జిల్లాకు ఆ సామర్థ్యం పూర్తిగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తిరుపతి జిల్లాలో ఇప్పటికే ఓడరేవు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులతో కూడిన బలమైన రవాణా మౌలిక సదుపాయాలు ఉన్నాయని ఆయన తెలిపారు. దీన్ని ఆధారంగా చేసుకుని జిల్లాను పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. పరిశ్రమలతో పాటు నివాస, పట్టణ ప్రణాళిక, సేవా రంగాల సమగ్ర అభివృద్ధి కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. నిత్యం తిరుపతి–తిరుమల ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి అనువైన సౌకర్యాలు, విశ్రాంతి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని పారిశ్రామిక విస్తరణ, పట్టణీకరణ, మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థలు, ఆర్థిక పురోగతి వంటి అంశాలను వివరించారు. సుమారు 30 వేల ఎకరాలకు పైగా పారిశ్రామిక భూభాగం క్రియాశీలకంగా ఉందని తెలిపారు. శ్రీ సిటీ, నాయుడుపేట ఈఎంసి క్లస్టర్లలో పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, చెన్నై––బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సిబిఐసి) ద్వారా జిల్లాకు పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా జిడిపిలో తయారీ రంగం వాటా 36 శాతంగా ఉండటం ప్రత్యేకత అని తెలిపారు. తలసరి ఆదాయంలో కూడా జిల్లా రాష్ట్ర సగటును అధిగమించిం దని చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ఇంటర్ మోడల్ స్టేషన్ (ఐఎంఎస్) ప్రతిపాదన, అలాగే మల్లమడుగు రిజర్వాయర్ ద్వారా తిరుపతి––తిరుమల ప్రాంతాలకు త్రాగునీటి సరఫరా మెరుగుపరి చే ప్రణాళికలను ఆయన వివరించారు. హెరిటేజ్ ఎకానమీ, ఆర్టిసనల్ క్లస్టర్ల అభివృద్ధి ద్వారా గ్రామీణ జీవనోపాధి పెంపు, స్థానిక కళల పరిరక్షణ, సాంస్కృతిక పర్యాటక ప్రోత్సాహం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నా మని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికా రులు తదితరులు పాల్గొన్నారు.



# పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

- తిరుపతిలో రూ.1,000 కోట్లతో ఐకానిక్ పర్యాటక కేంద్రాల అభివృద్ధి
- 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల లక్ష్యం
- తిరుపతిలో 'రిజెంటా దేవరాయ' ఫోర్ స్టార్ హోటల్ ప్రారంభించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పిస్తున్న ప్రభుత్వం
- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి రూరల్ –ఆంధ్రనాడు, మే 13:** రాష్ట్రంలో ప ర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బుధవారం తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'రి జెంటా దేవరాయ' ఫోర్ స్టార్ హోటల్‌ను జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసు లు, తిరుమల టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టెంపుల్ టూరిజం కీలక పాత్ర పోషిస్తోందని, దర్శనాలకు వచ్చే యాత్రికులు రెండు మూ డు రోజులు ఇక్కడే బస చేసి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వా దించేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. గత 24 నెలల్లో పర్యాటక రంగంలో సుమారు రూ.20 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంఓయూలు కుదుర్చుకున్న ట్లు వెల్లడించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో కొత్త పెట్టుబడిదారులకు ఎస్‌జీఎస్ టీ రీయింబర్స్‌మెంట్, పరిశ్రమలకు సమానమైన విద్యుత్ టారిఫ్ వంటి రాయితీలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తిరుపతి, విశాఖపట్నంను 'ఐకానిక్ పర్యాటక కేంద్రాలు'గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఒక్కో కేంద్రానికి రూ.500 కోట్ల చొప్పున మొత్తం రూ.1,000 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో 2029 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 50 వేల హోటల్ గదులు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని, ప్రతి నెల కనీసం రెండు కొత్త హోటళ్లు ప్రారం భమయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ రంగంలో వస్తున్న ఇలాంటి హోటళ్లు పర్యాటకుల అవసరాలను తీర్చడమే కాకుండా రాష్ట్ర పర్యాటక రంగ ముఖచిత్రాన్ని మార్చనున్నాయని మంత్రి ఆశాభావం వ్య క్తం చేశారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లా డుతూ, తిరుపతిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేం ద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత రెండేళ్లలో తిరుపతిలో హా స్పిటాలిటీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మారియాట్ ఇంటర్నేషనల్, లెమన్ ట్రీ హోటల్, ది ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ వంటి ప్రముఖ హోటల్ బ్రాండ్లు తిరుపతిలో కార్యకలాపాలు ప్రారంభిం చడం నగర అభివృద్ధికి నిదర్శనమన్నారు. 'రిజెంటా బై దేవరాయ' హోటల్ 56 గదులతో ప్రారంభం కావడం తిరుపతి పర్యాటక రంగంలో మరో మైలురాయిగా నిలు స్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం మొత్తం ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లకు అనుకూలమైన ఎకోసిస్టమ్‌గా రూపు దిద్దుకుంటోందన్నారు. భక్తుల బస వ్యవధిని రెండు రో జుల వరకు పెంచడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తిరు మలలో గదుల విస్తరణకు పరిమితులు ఉన్న నేపథ్యంలో తిరుపతిలో త్రీ స్టార్, ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్ హోటల్ గదుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీ సుకుంటోందన్నారు. పర్యాటక రంగాన్ని పరిశ్రమల విభాగంగా గుర్తిస్తూ ప్రత్యేక ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలో దామి నేడులో 21 ఎకరాల విస్తీర్ణంలో భారీ కన్వెన్షన్ కమ్ హోటల్ కాంప్లెక్స్ ఏర్పాటు కానుందని వెల్లడించారు. అ దేవిధంగా ది ఒబెరాయ్ గ్రూప్, అట్మాస్పెర్ కోర్ తదితర అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు కూడా తిరుపతిలో పెట్టు బడులకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. తిరుప తిలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయ ని, డిమాండ్‌కు అనుగుణంగా హోటల్ రంగంలో పెట్టు బడులు పెట్టాలని హోటలియర్లను ఆహ్వానించారు. పెట్టు బడి దారులకు భద్రత, పరిపాలనా సహకారం అందిం చేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, తిరుపతిని ఆధ్యాత్మిక కేం ద్రంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయి పర్యాటక నగ రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముం దుకు సాగుతోందన్నారు. భక్తులు తిరుమల దర్శనంతో పాటు తిరుపతిలో రెండు మూడు రోజులు గడిపేలా ఆధు నిక వసతి, వినోద, కన్వెన్షన్ సదుపాయాలు వేగంగా అభి వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకొ స్తున్న పర్యాటక అనుకూల విధానాల వల్ల ప్రముఖ జా తీయ, అంతర్జాతీయ హోటల్ సంస్థలు తిరుపతిలో పెట్టు బడులు పెట్టేందుకు ముందుకు వస్తుండటం ఆనందదా యకమన్నారు. 'రిజెంటా బై దేవరాయ' వంటి ఫోర్ స్టార్ హోటళ్లు పర్యాటకులకు నాణ్యమైన సేవలు అందించ డంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పి స్తాయని అన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థా నిక వ్యాపారాలు, రవాణా, హస్తకళలు, సేవారంగం మ రింత బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో తిరుప తి దేశంలోనే అత్యుత్తమ టెంపుల్ టూరిజం డెస్టినేషన్‌గా అవతరించబోతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కా ర్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి, టూరిజం ఆర్‌డీ రమణమూర్తి, హోటల్ యాజమాన్య ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## మహానాడు ఏర్పాట్లు చురుగ్గా... టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్





**తిరుపతి – ఆంధ్రనాడు, మే 13:** ఈనెల 26, 27, 28, తేదీల్లో జరుగునున్న మహానాడు కార్యక్రమాన్ని బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మీడియా కోఆర్డినేట్ సభ్యులు శ్రీధర్ వర్మ, ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పటిష్టం చేసేందుకు మహానాడు కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ మహానాడులో పార్టీ లోటుపాటులను చర్చించి పార్టీ కార్యకర్తలను సంబంధించి వారి యొక్క సాధక బాధలను సుదీర్ఘంగా చర్చించి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ మహానాడు ఒక నూతన ఉత్తేజాన్ని తీసుకురావడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నాయకత్వంలో పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు పార్టీలో నాయకులు కార్యకర్తలు అందరూ ఒక సైనికులుగా నడుం బిగించి పార్టీని ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


## ఉచిత పశు వైద్య శిబిరం



**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 13:** రామకుప్పం మండలం 89 పెద్దూరు గ్రామంలో దొడ్ల డైరీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి నారు సబ్సిడీ పై దాణా ఇవ్వడం జరిగినది డైరీకి పాలు పోసే రైతులకు సబ్సిడీ ధరపై షాప్ కట్టర్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా డైరీ రీజనల్ మేనేజర్ రమణారావు మాట్లాడుతూ రైతులకు ఇచ్చే పాలు ధర గిట్టుబాటుతోపాటు వారి పశువుల ఆరోగ్యం పట్ల కూడా తగు జాగ్రత్తలు తీసుకుంటుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ రమణ రావు మేనేజర్ మహమ్మద్ రఫీ దొడ్ల డైరీ పసువైద్యాధికారి మనోజ్ కుమార్ పెద్దూర్ పంచాయతీ టిడిపి అధ్యక్షుడు లోకేష్ ఏజెంట్ నాగభూషణం రైతులు పాల్గొన్నారు



# నర్సరీ గ్రోయర్స్‌కు అండగా





**శ్రీనివాస్ మంగాపురం / చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 13:** పరస్పర స హకారంతో ముందుకు సాగుదాం. సమన్వయంతో అవ కాశాలు అందిపుచ్చు కొందాం. ఆంధ్రప్రదేశ్ నర్సరీ గ్రో యర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం శ్రీనివాస మంగా పురంలో గోపాలం రవీంద్ర గారి అధ్యక్షతన జరి గింది. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ నాయ కులు మాట్లాడుతూ ప్రభుత్వం నర్సరీ గ్రోయర్స్ కు సహా యం అందించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానిం చింది. ముఖ్యంగా నీరు, విద్యుత్తు, అధిక ధరలు, మార్కె టింగ్ లాంటి సమస్యలతో పాటు వాతావరణ ప్రతికూ లత, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే వారిని ఆదుకోవా లని అన్నారు. అసోసియేషన్ కంపెనీ చట్టాల పరిధిలో మొక్కల పెంపకం, అమ్మకాలు పెంచడానికి ప్రయత్నిస్తా మన్నారు. నర్సరీ మొక్కలకు మంచి అవకాశాలు ఉన్నా యని. దీంతోపాటు నర్సరీలో ఆర్గానిక్ ఉత్పత్తులను అమ్మ కాలు ద్వారా ఆర్థికంగా ఊతం ఉంటుందన్నారు. సాంకే తిక పరిజ్ఞానాన్ని అసోసియేషన్ అందిస్తుందని, మనిషికి మొక్కలకు అభినవభావ సంబంధం ఉంటుందని అన్నా రు. సంఘం స్ఫూర్తితో పరిచయాలతో ఒకరికొకరు సహా యం చేసుకోవడమే ప్రామాణికంగా ఉండాలన్నారు. అంతరించిపోతున్న అరుదైన మొక్కలను, ఔషధ గుణాలు కలిగిన మొక్కలను ఆదరించి ప్రజలకు అందుబాటులో తక్కువ ధరలకు అందించడం లక్ష్యంగా పెట్టుకోవాల న్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా ఆకుల చల పతి రావు, ఉపాధ్యక్షులుగా శ్రీమతి సరిత విజయవాడ ,ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి దర్శి ,సహాయ కార్య దర్శులుగా చాంతాటి రమేష్ శ్రీకాకుళం, బండి అన్న రవి అంగళ్లు, కోశాధికారిగా మన్నే శ్రీనివాసరావు విజయవా డ, సమన్వయకర్తగా లక్ష్మీనారాయణ బాపట్ల, పౌరు సం బంధాల అధికారిక రాజ్ కుమార్ విజయవాడ, కార్యవ ర్గ సభ్యులుగా రంగస్వామి పాణ్యం,, కృష్ణమూర్తిజంగారెడ్డి గూడెం, ఆకివీడు ప్రసాద్, ఆకుల మునిరత్నం తిరుపతి, కాకినాడ వి ప్రసాద్, గుంటూరు ఉమా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు డాక్టర్ యం. ఆర్.యన్. వర్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో నర్సరీ అసోసియేషన్ అందుపుచ్చుకుని ప్రజలకు తక్కువ ధరలో మొక్కలు అందించాలని, సంగం ఐక్యతే ముఖ్యమని అ న్నారు. ఈ కార్యక్రమంలో నర్సరీ గ్రోయర్స్ అసోసియే షన్ స్థానిక నాయకులు హరికృష్ణ, కోటేశ్వరరావు, బాల రావి, మునిరత్నం, మునిశాఖర్, రేణుకలు పాల్గొన్నారు.




# క్వారీలో ప్రమాదం, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన జనార్ధన్ నాయక్ 42 మృతి

**పుంగనూరు – ఆంధ్రనాడు, మే13:** వివరాలు పుంగనూరు మండలం పాలెంపల్లి వద్ద క్వారీలో ప్రమాదానికి గురై జనార్ధన్ నాయక్ మృతి చెందాడు, ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు, ఉన్నారు, బ్రతుకుతెరువు కోసం ఒడిస్సా రాష్ట్రం నుండి, క్వారీ పనుల కోసం, కాంట్రాక్టర్ వర్కర్ గా పుంగనూరు ప్రాంతంకు రావడం జరిగింది, ఇతనికి ఒక కుమారుడు, ఆయుస్సు నాయక్, 10 ఒక కుమార్తె, అనిషా నాయక్, 5 జనార్ధన్ సొంత ఊరు జగమేరిపల్లి, భీష్మగిరి, డిగా గంజాం జిల్లా, ఒడిస్సా రాష్ట్రం, పుంగనూరు మండలం పాలెంపల్లి వద్ద ఉన్న ఏరన్సి కంపెనీ కి సంబంధించిన క్వారీలో పనిచేస్తూ ఈ ప్రమాదానికి గురై మృతి చెందడం జరిగింది. గతంలో కూడా ఈ క్వారీ లో ఇలాంటి ప్రమాదాలు చాలా జరిగాయని ఆ ఘటనలు గోప్యంగా ఉంచి సంబంధిత అధికారులు, స్థానిక రాజకీయ నాయకుల, చేతివాటంతో ప్రమాదాలు బయటకు రాకుండా సాక్షాదారాలు దొరకకుండా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి, ఈ క్వారీలో పనిచేయుటకు లోకల్ వ్యక్తులను ఉపయోగిస్తే వారికి ఇలాంటి ప్రమాదమే జరిగితే, ఇబ్బందులు పడతామని, తమ ఉనికికే ప్రమాదం జరుగుతుందని ఊహించుకుని, బయట రాష్ట్రాల నుండి వర్కర్స్ ను తెప్పించుకుని క్వారీ పనులకు ఉపయోగించుకుంటు న్నారు, ఇలాంటి ప్రమాదం ఏదైనా జరిగినప్పుడు , క్వారీ వారికి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు, ఇతర రాష్ట్రాల నుండి బ్రతుకుతెరువు కోసం ఈ క్వారీ పనులకు వస్తే, ప్రమాదాలు జరిగినప్పుడు గుట్టుచప్పుడు కాకుండా సమస్యను పరిష్కారం చేసుకోవచ్చని , ఇలాంటి వారిని ఎంపిక చేస్తున్నారని సర్వత్ర విమర్శలు ఉన్నాయి.



# గంగమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన – బందోబస్తుపై డీఎస్పీ సమీక్ష

**పలమనేరు, ఆంధ్రనాడు, మే 13 :** పలమనేరు పట్ట ణంలో అత్యంత వైభవంగా జరిగే గంగమ్మ జాతరను పు రస్కరించుకుని బుధవారం శాంతిభద్రతలు మరియు బం దోబస్తు ఏర్పాట్లను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో ప రిశీలించారు. పలమనేరు డీఎస్పీ దేగల ప్రభాకర్, పట్టణ సీఐ మోహన్ రెడ్డి, మరియు గంగవరం సీఐ రాంభూ పాల్ తో కలిసి పట్టణంలోని ప్రధాన వీధులు, జాతర జరిగే ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీ ఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ...జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీ సుకుంటున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు మరియు రద్దీ సమయాల్లో తీసుకోవాల్సిన జా గ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. జాతర జరి గే పరిసరాల్లో సీసీ కెమెరాల నిఘా, అదనపు పోలీసు బల గాల మోహరింపుపై చర్చించారు. వాహనాల రాకపోక లకు ఆటంకం కలగకుండా పార్కింగ్ స్థలాలను కేటా యించాలని ఆదేశించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో స మన్వయం చేసుకుంటూ జాతరను ప్రశాంతంగా నిర్వ హించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఇతర పోలీ సు సిబ్బంది మరియు స్థానిక అధికారులు పాల్గొన్నారు.






# సినిమా నడిస్తేనే మనందరికి మనుగడ

ఎగ్జిబిటర్లకు మాత్రమే కాదు.. డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతలకు కూడా సమస్యలు ఉన్నాయని తెలుగు సినీ నిర్మాతలు అన్నారు. తాము ఇబ్బందుల్లో ఉన్నామని, పర్సెంటేజ్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎగ్జిబిటర్లు ఇటీవల ప్రెస్ మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై బుధవారం సాయంత్రం తెలుగు నిర్మాతలు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్‌మీట్‌లో నిర్మాతలు యలమంచిలి రవిశంకర్, సూర్యదేవర నాగవంశీ, సాహు గారపాటి, సుధాకర్ చెరుకూరి, వెంకట సతీష్ కిలారు తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిటర్లు ఏకపక్షంగా ప్రెస్‌మీట్ నిర్వహించి బెదిరించినట్టుగా మాట్లాడటం సరికాదని, అందరం కూర్చొని మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని నిర్మాతలు అన్నారు. ఎగ్జిబిటర్ల సమస్యను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అదే సమయంలో తమ సమస్యలకు కూడా పరిష్కారం కావాలని నిర్మాతలు అన్నారు.

నిర్మాత యలమంచిలి రవిశంకర్ మాట్లాడుతూ, 'ఎగ్జిబిటర్లు ఇబ్బంది పడుతున్నారు.. మేము దానికి అంగీకరిస్తాం. కానీ, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దయచేసి గ్రహించండి. ఎన్నో ఏళ్లుగా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఇప్పుడు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు ఎవరూ సంతోషంగా లేరు. ముగ్గురికీ సమస్యలు ఉన్నాయి. చర్చించుకొని పరిష్కరించుకుందాం' అని అన్నారు. 'ఎకో సిస్టమ్‌లో ఒకరు బాగోకపోతే ముగ్గురూ బాగోరు. ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ ముగ్గురూ బాలేదు. కంటెంట్ లేక శ్రీరాములు లాంటి థియేటర్ ను మూసేయాల్సి వచ్చిందని వాళ్ళే చెప్పారు.

ఎగ్జిబిటర్లు ఇలాంటి షరతులు పెట్టడం వల్ల నిర్మాతల నుంచి ఇంకా కంటెంట్ తగ్గిపోతుంది తప్ప, దాని వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదు కదా. ఇలా ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకొని, ఫలానా తేదీ చివరి రోజు అంటూ బెదిరించినట్టుగా మాట్లాడకండి. ఇక్కడ ఉన్న నిర్మాతలవి 50 శాతానికి పైగా చిత్రీకరణ అయిపోయిన సినిమాలు కనీసం 25 ఉన్నాయి. వీటిలో చిన్న, పెద్ద అన్ని సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే 70-80 శాతం బడ్జెట్ ఖర్చు పెట్టి ఉన్నాము. ఇలాంటి సమయంలో కొత్త విధానం తీసుకొస్తామంటే అది సబబుగా ఉండదు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న సినిమాల విషయంలో ఆ విధానాన్ని అంగీకరించలేము. కొత్తగా నిర్మించబోయే సినిమాల విషయంలో ఈ విధానంపై ఆలోచిస్తాము. కానీ, దానికి కొన్ని షరతులు ఉన్నాయి. థియేటర్ల గ్రేడింగ్, మెయింటనెన్స్ ఛార్జ్, ఆన్ లైన్ టికెట్ బుకింగ్ కన్వీనెన్స్ ఛార్జ్ వంటి విషయాలపై చర్చించిన తర్వాత.. కొత్తగా నిర్మించబోయే సినిమాల విషయంలో పర్సెంటేజ్ విధానానికి వెళ్ళడంలో మాకు అభ్యంతరం లేదు' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు.

నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ, 'మనంలో మనం ఇలా కొట్టుకోవడం వల్ల లోకువ అయిపోతాం. సమస్యను పరిష్క రించుకునే దిశగా మనం వెళ్ళట్లేదు. ఈ అంశంపై ఫిల్మ్ ఛాంబర్ తరపు నుంచి కూడా మీటింగ్ లు జరిగాయి. ఓ వైపు చర్చలు జరుగుతుండగానే, అలా ఏక పక్షంగా ప్రెస్ మీట్ ఎందుకు పెట్టారో మాకు అర్థం కావడంలేదు' అని తెలిపారు. '20 సంవత్సరాల నుంచి తెలంగాణలో ఎవరు డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నారో అందరికీ తెలుసు. 20 సంవత్సరాల నుంచి ఎగ్జిబిటర్లకు న్యాయం చేయలేనిది ఈరోజు గుర్తుకొచ్చిందా?. సినిమా నడిస్తేనే మనందరికీ మనుగడ. లేకపోతే అందరం నష్టపోతాం' అని అన్నారు.

# నాగార్జున ఫోటోలు టీ-షర్టులు..హైకోర్టు ఆగ్రహం



**హైదరాబాద్:** ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున తన అనుమతి లేకుండా పేరు, ఫోటోలను వాడుకుంటున్నారంటూ దాఖలు చేసిన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన కేసులో ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తన చిత్రాలతో టీ-షర్టులను విక్రయిస్తున్న ఓ వ్యాపారిపై మంగళవారం జస్టిస్ తుషార్ రావు గెడెలా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. విచారణ సందర్భంగా "నాగార్జున ఫోటోలను వాణిజ్యపరంగా వాడుకునే హక్కు మీకు ఎవరు ఇచ్చారు?" అని సదరు వ్యాపారిని కోర్టు నిలదీసింది. దీనికి వ్యాపారి తరఫు న్యాయవాది స్పందిస్తూ.. 'ది ఘోస్ట్' సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని, ఓ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా నిర్మాణ సంస్థతో ఒప్పందం ఉందని తెలిపారు.

నాగార్జున స్వయంగా ఆ వస్తువులను ప్రమోట్ చేశారని కూడా వాదించారు.అయితే, నాగార్జునతో గానీ, సినిమా నిర్మాణ సంస్థతో గానీ తమకు ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని విచారణలో వ్యాపారి అంగీకరించారు. ఈ వాదనపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే చెబుతున్నప్పుడు, ఈ టీ-షర్టులను విక్రయించే చట్టబద్ధమైన హక్కు మీకు ఎక్కడిది?" అని ప్రశ్నించింది. దీంతో, సంబంధిత ఒప్పంద పత్రాలు, ఇతర ఆధారాలు సమర్పించడానికి తమకు అవకాశం ఇవ్వాలని వ్యాపారి తరఫు న్యాయవాది కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది.

# కోహ్లి అజేయ సెంచరీ

## కోల్ కతా నైట్ రైడర్స్ పై బెంగుళూరు




**రాయ్ పూర్ :** కోల్ కతా నైట్ రైడర్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)భారీ లక్ష్యాన్ని ఛేదించింది.కోల్ కతా నిర్దేశించిన 193పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగళూరు బ్యాటర్లు కోహ్లి(105నాటౌట్)సెంచరీకి తోడు పడిక్కల్(39)రాణించారు. దీంతో బెంగళూరు 19.1ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి 194పరుగులు చేసి గెలిచింది .కోల్ కతా బౌలర్లు కార్తీక్ త్యాగికి మూడు,నరైన్ ఒక వికెట్ పడగొట్టారు.ఈ గెలుపుతో బెంగళూరు పాయింట్ల పట్టికలో మరోసారి అగ్రస్థానానికి ఎగబాకింది.అంతకుముందు కోల్ కతా బ్యాటర్ రఘువంశీ అర్ధ శతకంతో రాణించడంతో నిర్ణీత 20ఓవర్లలో4వికెట్ల నష్టానికి 192పరుగులు చేసింది.రఘువంశీ అర్ధ శతకానికి తోడు గ్రీన్(32),రింకు సింగ్(49నాటౌట్)బ్యాటింగ్ లో రాణించారు.

బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్,హేజిల్ వుడ్,రసిక్ సలామ్ దర్ కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విరాట్ కోహ్లికి దక్కింది.

**వర్షంతో టాస్ ఆలస్యం**

భారీ వర్షం కారణంగా నిర్ణీత సమయానికి ప్రారంభం కావాల్సిన మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది.మ్యాచ్ ప్రారంభానికి ముందు రాయ్‌పూర్‌లోని భారీ వర్షం కురవడంతో షహీద్ వీర్ నారాయణ్ సింగ్ స్టేడియం తడిసి ముద్దయ్యింది.దీంతో టాస్ గంటన్నర ఆలస్యంగా వేశారు.

అయితే,ఓవర్ల కుదింపు ఏమీ లేకుండానే మ్యాచ్ ప్రారంభమైంది.టాస్ గెలిచిన అనంతరం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ మాట్లాడుతూ... రొమారియో షెపర్డ్ స్థానంలో వెంకటేశ్ అయ్యర్,సుయాశ్ శర్మ స్థానంలో జాకబ్ డఫీ జట్టులోకి తీసుకున్నట్లు తెలిపాడు.

కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే మాట్లాడుతూ,తాము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నా..కీలక స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమైనట్లు..అతని స్థానంలో సౌరభ్ దూబే అరంగేట్రం చేస్తున్నట్లు తెలిపాడు.

స్కోర్ బోర్డు...

**కోల్ కతా నైట్ రైడర్స్ :** రహానే(సి అండ్ బి)హేజిల్ వుడ్ 19,అలెన్(సి)జితేశ్ శర్మ (బి)భువనేశ్వర్ కుమార్ 18,రఘు వంశీ (రనౌట్)భువనేశ్వర్ కుమార్ 71,గ్రీన్(బి)రసిక్ సలామ్ ధర్ 32,రింకు సింగ్ (నాటౌట్) 49, అదనం3. (20 ఓవర్లలో4వికెట్ల నష్టానికి) 192 పరుగులు.

**వికెట్ల పతనం:** 1/23, 2/48, 3/116, 4/192

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 4-0-34-1,డఫీ4-0-48-0,హేజిల్ వుడ్ 4-0-35-1,రసిక్ సలామ్ దర్ 4-0-35-1,కృనాల్ పాండ్యా 4-0-39-0.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు :** బేథెల్(సి అండ్ బి)కార్తీక్ త్యాగి 15,కోహ్లి(నాటౌట్) 105, పడిక్కల్(సి)రహానే(బి)కార్తీక్ త్యాగి 39,రజత్ పటీధర్ (సి)రహానే(బి)నరైన్11,టిమ్ డేవిడ్ (సి)మనీష్ పాండే (బి)కార్తీక్ త్యాగి 2,జితేశ్ శర్మ (నాటౌట్) 8, అదనం14. (19.1 ఓవర్లలో4వికెట్ల నష్టానికి) 194 పరుగులు.

**వికెట్ల పతనం:** 1/37, 2/129, 3/157, 4/180

బౌలింగ్:సౌరభ్ దూబే 2.1-0-21-0,వైభవ్ అరోరా 4-0-48-0,కార్తీక్ త్యాగి 4-0-32-3,నరైన్4-0-31-1,గ్రీన్2-0-22-0,అనుకుల్ రాయ్ -0-36-0.

# సింధు,లక్ష్యసేన్,శ్రీకాంత్ శుభారంభం




**బ్యాంకాక్ :** థాయ్ లాండ్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ లో భారత్ కు మిశ్రమ ఫలితాలు దక్కాయి.బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో కిదాంబి శ్రీకాంత్,లక్ష్యసేన్ శుభారంభం చేయగా..యువ షట్లర్ ఆయుశ్ శెట్టి తొలిరౌండ్ లోనే ఇంటిదారి పట్టాడు.

ఇక మహిళల సింగిల్స్ లో పివి సింధు,మాళ్విక బన్సోద్,దేవిక సిహాగ్ తొలిరౌండ్ గండం గట్టెక్కి ప్రి క్వార్టర్స్ కు చేరారు.సింధు21-9, 21-12తో కేవలం 33నిమిషాల్లో చైనీస్ తైపీకి చెందిన టంగ్-సియోవో-టోంగ్ ను ఓడించింది.రెండో రౌండ్ లో డెన్మార్క్ కు చెందిన41వ ర్యాంకర్ అమేలియా షుల్జ్ తో తలపడనుంది. ఇక21ఏళ్ల దేవిక 21-19, 13-21, 21-15తో జపాన్ షట్లర్, 26వ ర్యాంకర్ నసూకి నిడైరాను ఓడించింది.ఈ పోటీ సుమారు గంటా 11నిమిషాలసేపు హోరా హోరీగా సాగింది.ఇక తన్వీ శర్మ 21-17, 21-8తో హీనా అకేచిని ఓడించి ప్రి క్వార్టర్స్ కు చేరారు.మాళ్విక భారత్ కే చెందిన అన్మోల్ ఖర్బ్ ను ఓడించి టాప్ సీడ్ చెన్-యూఫీ(చైనా)తో పోటీకి సిద్ధమైంది.


పురుషుల సింగిల్స్ లో ప్రపంచ 11వ ర్యాంకర్ లక్ష్యసేన్ 21-16, 21-17తో43నిమిషాల్లో సింగపూర్ కు చెందిన హెంగ్ జాసన్ ను ఓడించాడు.ప్రపంచ29వ ర్యాంకర్ కిదాంబి శ్రీకాంత్21-14, 21-15తో సింగపూర్ కు చెందిన లోహ్ కియాను చిత్తుచేసి ప్రి క్వార్టర్స్ లో చైనీస్ తైపీ ఆటగాడు సు-లి-యాంగ్ తో పోటీకి సిద్ధమయ్యాడు.ఇక21ఏళ్ల ఆయుష్ శెట్టి మూడు సెట్ల హోరా హోరీ పోరులో ప్రపంచ 9వ ర్యాంకర్,జపాన్ కు చెందిన నరోకా చేతిలో పోరాడి ఓడాడు.ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్ లో ఆయుష్ శెట్టి 13-21, 21-17, 4-21తో పరాజయాన్ని చవిచూశాడు.ఈ మ్యాచ్ సుమారు 59నిమిషాలసేపు సాగింది.

# అగ్రస్థానంలోనే బుమ్రా




**దుబాయ్:** టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటాడు. ఐసిసి బుధవారం విడుదల చేసిన జాబితాలో బుమ్రా 879 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. గత ఏడాది నవంబర్ నుంచి భారత్ టెస్ట్ మ్యాచ్‌లు ఆడనప్పటికీ బుమ్రా పాయింట్ల పరంగా తన స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం. బుమ్రా తర్వాతి స్థానాల్లో ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ స్టార్క్ 2వ స్థానంలో, న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ మూడో స్థానంలో ఉన్నారు. ఇక బ్యాటింగ్ విభాగంలో యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ టాప్-10లో ఉన్నాడు. జైస్వాల్ 750 పాయింట్లతో 8వ, శుభ్‌మన్ గిల్ ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని 730 పాయింట్లతో 9వ స్థానానికి చేరుకున్నాడు. ఇక ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ 880 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. హ్యారీ బ్రూక్, ట్రావిస్ హెడ్ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

# అన్ని వ్యాధులకు “అంబలి” అణుబాంబు లాంటిది



పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వల్లి

- వరి మానేస్తే “వర్రీ” ఉండదు
- మిక్స్‌డ్ మిల్లెట్స్ తినొద్దు
- “జెన్ జీ” మీ పెద్దల్ని అనుసరించొద్దు
- ఆంధ్రనాడు ముఖాముఖిలో డాక్టర్ ఖాదర్

మైసూర్– ఆంధ్రనాడు, మే 13:

తరం మారింది, టెక్నాలజీ పెరిగింది, జీవన విధానం మారింది, సగటు మనిషి ఆయుర్దాయం కూడా పెరిగింది కానీ, అది జబ్బులమయంగా మారిపోయింది. అతి పిన్న వయసులో ఊహించని వ్యాధులు యువ తరాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా దీర్ఘ కాలిక వ్యాధులకు కారణం అయి వారి జీవితాన్ని కుదిపేస్తున్నాయి. ప్రధానంగా మానసిక సమస్యలు ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే విషయం. అయితే ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం పొట్టలోనే ఉంది అంటున్నారు ప్రముఖ శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలవబడే డాక్టర్ ఖాదర్ వల్లి. ఆంధ్రనాడు తో జరిపిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలపైన చర్చించారు. వాటిలో కొన్ని పాఠకులకోసం ఆయన మాటల్లో అందిస్తున్నాం.

**సమాజం మొత్తం ఒత్తిడిలో ఉంది**

సమాజం మొత్తం ఏదో ఒక మానసిక ఒత్తిడిలో ఉంటోంది. కార్పొరేట్ రంగం వలన జీవన విధానంలో వచ్చిన మార్పులు జీవితాన్ని ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. అందరూ కూడా ఒక నకిలీ ప్రపంచంలో బ్రతుకుతున్నారు. పెద్ద పెద్ద రెస్టారెంట్స్ లో పేరు తెలియని ఆహారాల్ని తిని అదో గొప్ప జీవితమని సంబరపడుతూ, పర్యవసానంగా దీర్ఘ కాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. నాలుగు వానలు పడే, రెండెకరాల బంజరు భూమిలో మిల్లెట్స్ పండించుకొని తినడం మొదలు పెడితే,వారికన్నా ప్రపంచంలో ఆరోగ్యకరమైన ఆనందమైన జీవితాన్ని గడిపేవారు ఎవరూ ఉండరు. రెండు ఎకరాల బంజరు భూమిలో రెండు క్వింటాళ్ల మిల్లెట్స్ పండించవచ్చు. నలుగురు సభ్యులున్న ఇంట్లో మూడు పూటలా ఏడాది పాటు తిన్న తర్వాత కూడా మిగులుతుంది. ఇలా చేస్తే డాక్టర్ ని మరిచిపోవచ్చు.

**వరిని వదిలేస్తే వర్రీ ఉండదు**

ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలన్నిటికీ కారణం జీవన శైలితో పాటు వరి అన్నం కూడా ప్రధాన కారణం. గడిచిన తరంలో అరికెలు, సామెలు, ఊదలు, అండుకొర్రలు మొదలైన వాటితో వండి తినేవారు. జబ్బులు లేకుండా బ్రతికేవారు. ఇప్పుడు సెల్ లేని ఇల్లు, జబ్బులేని ఒళ్లు లేదనే పరిస్థితి వచ్చింది. ఫెర్టిలైజర్స్ కంపెనీ వాళ్ళు వల్ల వరి పంట అనేది మన ప్రధాన ఆహారంగా మారింది. అదే మన కొంప ముంచింది. వరి అన్నం వదిలేస్తేనే మన వ్యాధుల వర్రీ అనేది పోతుంది. కొంతమంది బ్లాక్ రైస్ , బ్రౌన్ రైస్ తింటే మంచిది అనుకుంటారు. అది పొరపాటు . (వరి)రైస్ ఏదైనా ఒకటే. కాబట్టి తినకపోవడమే ఉత్తమం.

**సగటు మనిషి మందులమీద పెట్టే ఖర్చు 10 వేలు**

మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు వలన సగటు మనిషి కేవలం మందులకోసం నెలకు 10 వేలనుంచి 30 వేలవరకు ఖర్చు చేస్తున్నాడు. అదే మనిషి తన మందులకు పెట్టే ఖర్చు తో మిల్లెట్స్ తింటే ఆరోగ్యానికి ఆరోగ్యం డబ్బులు ఆదా అవుతుంది. ఆరోగ్యంగా బ్రతకడమే జీవితం. వేరే వాళ్ల కలల్ని సాకారం చేయడానికి మనం బ్రతక కూడదు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే మిల్లెట్స్ తినాలి. మారాలి.

**అంబలి అణుబాంబు లాంటింది**

అంబలిని అందరూ తాగాలి, అన్ని వ్యాధుల మీద అది అణుబాంబు లాగా పనిచేస్తుంది. ఏదైనాఒక మిల్లెట్ ని వరుసగా రెండురోజులపాటు అంబలి లాగా తయారు చేసి తాగాలి. అలా మరో రెండు రోజుల పాటు ఇంకో మిల్లెట్ ని ఎంచుకోవాలి. అలా మొదట మూడు వారాలు పాటు తాగిన తరువాత ఆశించిన స్థాయిలో ఫలితం ఉంటుంది. అలా చేసిన తరువాత మాత్రమే పూర్తి స్థాయి లో మిల్లెట్ ఆహారానికి మారాలి. అంబలి అలవాటు చేసుకోకుండా నేరుగా మిల్లెట్ ఆహారాన్ని తీసుకోవడం వలన అజీర్తి సమస్యలు వస్తాయి. కాబట్టి ఒక ప్రోటోకాల్ ప్రకారం ఆహారం తీసుకోవడం అవసరం. ఆయా జబ్బులకు ఏది ఎలా తీసుకోవాలి అనేది “సిరి జీవన విధానం” పుస్తకంలో వివరించాను. దానికి సంబంధిచిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి పుస్తకాన్ని ఉచితంగా పొందవచ్చు. ప్రధానంగా అందరూ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే మిక్స్‌డ్ మిల్లెట్స్ తో ఆహారాన్ని తయారు చేసుకో కూడదు, అలా అని ఒకే మిల్లెట్ ని కూడా దీర్ఘ కాలికంగా ఆహారంగా చేసుకో కూడదు. ఎంపిక చేసిన ఒక్కో మిల్లెట్ని రెండురోజులకు ఒకమారు మారుస్తూ ఉండాలి. ఉదాహరణకు వచ్చే రెండురోజులపాటు అరికెలు వాడితే, ఆ వచ్చే మరో రెండు రోజులు ఊదలు వాడాలి. అలా కొనసాగించాలి.




ఉచితంగా డాక్టర్ ఖాదర్ వల్లి గారి పుస్తకాలకోసం ఈ క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేయండి

**రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం అన్యాయం**

భారత దేశం డయాబెటిస్ కాపిటల్ అని అందరికీ తెలిసిందే కానీ దాని నుంచి బయటపడటానికి ప్రభుత్వం ఏమి చేయాలి అనేది ఎవరూ పట్టించుకోవట్లేదు. ఎందుకంటే ఫెర్ట్ లైజర్స్ కంపెనీలకు, వరి మరియు గోదుమలు అంటే నే ఇష్టం. ఆ పంటలు పండకపోతే వారి ఉత్పత్తులు అమ్ముడుపోవు. అందుకని ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి రైతులకు సబ్సిడీలను ఇచ్చి మోసం చేస్తోంది కంపెనీలే. అయితే ఆ మోసం నుండి భయటపడి మిల్లెట్స్ పండించి సమాజానికి ఉపయోగపడే ప్రయత్నం చేస్తున్న రైతులకు మాత్రం ఎలాంటి గుర్తింపు లేదు, ప్రోత్సాహాలు లేవు. ఇది ఖచ్చితంగా సమాజానికి రైతులకు చేస్తున్న అన్యాయమే.

**“జెన్ జీ “ మీరు మోసపోవద్దు**

మీ ఇంట్లో పెద్దల్ని అనుసరించి మీరు మోసపోవద్దు. వారు ఎలాగూ కార్పొరేట్ మాయలో పడి, రోగాల బారిన పడ్డారు. మీరు వారిని అనుసరిస్తే మీరు కూడా రోగాలతో సహజీవనం చేయాల్సి వస్తుంది. కాబట్టి ఆరోగ్య కరమైన జీవన విధానాన్ని అనుసరించి మిల్లెట్స్ ని ఆహారంగా తీసుకోవడం వల్ల ఏ వ్యాధులు రాకుండా జీవితాన్ని ఆస్వాదించవచ్చు. మిల్లెట్స్ తో ఏ రోగమైనా మటు మాయం అవుతుంది అనేది నిజం. అది మీ పొట్ట నుంచే మొదలవుతుంది. దానికి లక్షలాది మంది ఉదాహరణాగ ఉన్నారు.

డాక్టర్ ఖాదర్ వలి సిఫార్సు చేసిన, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే 5 ముఖ్యమైన “పాజిటివ్ మిల్లెట్స్”
(Positive Grains/Siridhanyalu):

కొర్రలు (Foxtail Millet)
అండుకొర్రలు (Browntop Millet)
అరికలు (Kodo Millet)
సామలు (Little Millet)
ఊదలు (Barnyard Millet)

**పాజిటివ్ మిల్లెట్స్ వల్ల కలిగే ప్రయోజనాలు:**

పీచు పదార్థం (Fiber): ఇవి 8% నుండి 12% వరకు అధిక పీచు పదార్థాన్ని కలిగి ఉంటాయి.
గ్లూటెన్ ఫ్రీ (Gluten-free): గోధుమలకు బదులుగా, గ్లూటెన్ సమస్య ఉన్నవారికి ఇది మంచి ప్రత్యామ్నాయం.
తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (Low GI): డయాబెటిస్ (మధుమేహం) నియంత్రణకు, బరువు తగ్గడానికి ఇవి చాలా సహాయపడతాయి.
పోషకాలు: ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ప్రోటీన్లతో సమృద్ధిగా ఉంటాయి.



# బంగారుతల్లులూ..భవిష్యత్తు మీదే!

- ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ శివజ్యోతి
- బాలసదనం సందర్శించిన జేడీ
- అక్కడి చిన్నారులతో మాటామంతి
- వారిలోని ప్రతిభను గుర్తించి అభినందించిన శివజ్యోతి
- చిల్డ్రన్ హోం నిర్వాహకురాలు రఫీమున్నీసా, సిబ్బందికి ప్రత్యేక ప్రశంసలు

అనంతపురం –ఆంధ్రనాడు, మే 13

‘మేమూ మీ వయస్సులో ఉన్నప్పుడు ఎన్నో ఒడిదుడుకులు చూశాం. ఇప్పుడున్న సౌకర్యాలు, వసతులు, అవకాశాలు అప్పుడు లేవు. అయినా పట్టుదలతో చదివాం. ఇప్పుడు ఈ స్థాయిలో ఇలా మీ ముందుకు వచ్చాం. మీరు వచ్చిన నేపథ్యం ఏదైనా గానీ వాటిని మనస్సులో నుంచి పూర్తిగా తుడిచేయండి. ఇప్పటి నుంచే మీకంటూ ఒక లక్ష్యం ఏర్పరచుకోండి. వాటిని సాకారం చేసుకునే దిశగా ఆలోచించండి. అడుగులు వేయండి. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి. కసితో చదవండి. మీరనుకున్న లక్ష్యం నెరవేర్చుకుంటారు. అప్పటికి మేమంతా రిటైర్డ్ అయి ఇళ్లల్లో ఉంటాం. భవిష్యత్ అంతా మీదే. మాలాగా మంచి హోదాల్లో మీరు కూడా స్థిరపడాలి. పది మందికి ఉపయోగపడాలి’ అంటూ ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్(జేడీ) శివజ్యోతి అన్నారు. అనంతపురం బుడ్డప్పనగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంను పీడీ శశికళతో కలసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండ్రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన జేడీ.. బాలసదనాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లలు తమ చిట్టి చేతులతో రూపొందించిన కలర్ పేపర్ల బొకేను అందించి స్వాగతం పలికారు. వాటిని ఎలా తయారు చేశారు, ఎవరు చేశారంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. మీరొస్తున్నారని.. మేమే చేశాం మేడం అంటూ చిన్నారుల సమాధానంతో ఆమె ఆశ్చర్యపోయారు. ఇంత అందంగా తయారు చేయడం చూస్తుంటే మీలో చాలా ప్రతిభ దాగుందని, ఇంత చక్కటి ఆలోచన ఎలా వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. మా సూపరింటెండెంట్ రఫీమున్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది నేర్పించారంటూ చిన్నారులు బదులివ్వడంతో ఆమె వారిని కూడా అభినందించారు. మార్కెట్లో తయారు చేసే పుష్పగుచ్ఛాలకు ఏమాత్రం తీసిపోకుండా వాటికంటే అందంగా తయారు చేయడం తనకు బాగా నచ్చిందని, వీటిని నేను తీసుకెళ్లనా అంటూ అడిగి మరీ వెంట తీసుకెళ్లారు. చిన్నారుల క్రమశిక్షణ చూస్తుంటే ముచ్చటేస్తోందని, చదువులో కూడా ఇటువంటి చొరవ చూపి భవిష్యత్లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. తరువాత కార్యాలయం గది, ఇతర గదులతో పాటు డార్మెటరీ, వంట గది.. ఇలా అన్ని గదులను ఆమె పరిశీలించారు. ఇక్కడి వాతావరణం తనను బాగా ఆకర్షించిందని, మనస్సుకు హాయిగా ఉందని పేర్కొన్నారు. అక్కడి నుంచి శిశుగృహను సందర్శించారు. కార్యక్రమంలో గుంటూరు నుంచి వచ్చిన సీడీపీఓ సునీత, డీసీపీఓ మంజునాథ్, బాలసదనం సూపరింటెండెంట్ ఖాజీ రఫీమున్నీసా, అకౌంటెంట్ ఫాతిమా, సిబ్బంది అమీన, మాధవి పాల్గొన్నారు.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P.,
Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733